# చంటమ్మ సంపాదన

**వాళ్ళమ్మ భోగాల లక్ష్మణరావుతో ఆది తీయించి కుట్టించిన పూలగౌను తొడిగితే చల్దిపోద్దేళ దాటకముందే దాన్ని విప్పి మడతెట్టేసి ట్రంకు పెట్లో దాచేసుకుంది చంటమ్మ.**

**అది చూసిన వాళ్ళమ్మ "అదేంటే" అంటే "ఎక్కువసేపు కట్టుకు తిరిగితే మాసిపోద్ది గదా?" అంది చంటమ్మ.**

**చిన్నపిల్ల నోట్లోంచి ఇలాంటి మాటలు రావడం చూసి నోరు పడిపోయింది ఆళ్ళమ్మ సూరమ్మకి.**

"మీ నాన్న వెదురుపాకసావరం వెళ్ళేరు రాడానికి బాగా పొద్దోద్ది. సంత జేసుకురా చంటీ" అని రెండు రూపాయిల కాయితం బుట్టా ఇచ్చింది సూరమ్మ.

ఉల్లిపాయల గంగిరెడ్డిగారి దుకాణం దగ్గర కెళ్ళి వీసెడు ఉల్లిపాయలకి వంద బేరాలాడి మరీ బుట్టలో వేయించుకుని, కొసరుగా ఒక కట్ట కరివేపాకూ ఒక కట్ట కొత్తిమీరిం లాక్కుంది. లోవరాజు దుకాణం దగ్గరకెళ్ళి ఏబులం బెండకాయలకి బోల్డుసేపు బేరమాడి చివరికి ముక్కుతా మూలుగుతా తూయించి బుట్టలోవేయించుకుని కొసరుగా ఒక కొత్తి మీరింకట్ట, పెద్ద కరివేపాకు రొబ్బా తీసుకుంది.

ఇలా సంతంతా తిరుగుతా కొన్న అసలు కంటే కొసరు ఎక్కువ సంపాదిస్తుంది చంటమ్మ.

దీపాలవేళ దాటింది.

సందడిచేస్తున్న గోదావరి కాలవ వూళ్ళోకి పంపిస్తుంది చలిగాలిని.

కాలవ ఒడ్డున లంగరేసిన ముగ్గు పడవలో ఆడమనిషి వంట చేసుకుంటుంది.

కిళ్ళీరన్న కాఫీ హోటలు బల్లమీద కూర్చుని పాటలు పాడుతున్నాడు అబ్రహాం. నాటుసారా మత్తులో ఉన్న జక్కంవీరన్న అబ్రహాం పాటకి మరింత మత్తుగా ఊగుతున్నాడు.

ఊరు చీకటితో నిండిపోయింది.

హరికెన్ లాంతరు పట్టుకుని ఎదురైన వాళ్ళనందర్నీ మా చంటమ్మ కనపడిందా అని అడుగుతా సంతపేటలో కొచ్చింది సూరమ్మ.

పొరుగూర్నుంచి వ్యాపారం చేసుకునే వాళ్ళు అప్పటికే దుకాణాలన్నీ సర్దేసుకుంటున్నారు. కాళీ అయిన సంతంతా వెతికి కూతురేవయిపోయిందో అని శోకాణాలు తీస్తా ఇంటి కెళ్ళేసరికి నిండిపోయిన కూరలబుట్టతో అరుగుమూల పడేసిన ధాన్యం బస్తాల మీద కూర్చునుంది చంటమ్మ.

"ఎక్కడికెళ్ళేవే ఎదవముండా?" అనరిచింది సూరమ్మ.



''సంత చేసుకురాడానికి'' నవ్వుతా చెప్పింది చంటమ్మ.

''నీకోసం సంతపేటంతా ఎతికి ఎతికి వస్తన్నానే ఎక్కడ పెత్తనాలు చేసొస్తున్నావే?'' అంది.

''చెపుతానుగానీ... ఇయిగో కూరగాయలు, ఇదిగో నువ్విచ్చిన రెండురూపాయల కాయితం'' అంటా రెండు వేళ్ళ మధ్యలో నొక్కి మరీ అందించిందా దళసరినోటు.

దాన్ని చూసి తూలిపడబోయిన సూరమ్మ ''ఇదేంటే నేనిచ్చిన రెండు కాయింతం తిరిగిచ్చేస్తన్నావ్ ఈ కూరలకి డబ్బు లెక్కడ్నించి వచ్చినియ్యి?'' అనడిగింది సూరమ్మ.

''ఒకో దుకాణంలోను కొసరు తీసుకున్న కొత్తిమీరిం, కరివేపాకు బుట్టెడు దాకా వచ్చినియ్యి, వాటిని పేర్వేల బ్రాహ్మల ఇంట్లో అమ్మితే రెండు రూపాయలిచ్చేరు. సంతకి నేచేసిన ఖర్చు కూడా రెండ్రూపాయలే''.

చంటమ్మ తెలివికీ పొదుపుకి చాలా ముచ్చట పడిపోయింది సూరమ్మ.

అక్కడ్నించి ఇలాంటి పన్లు చెయ్యడంలో బాగా ఆరితేరిపోయింది చంటమ్మ.



ఆర్తమూరు సంబంధం చూసి పెళ్ళి చేసేరు చంటమ్మకి. భర్తపేరు బుచ్చిరెడ్డి. నెమ్మదస్తుడు. పుట్టింటి నించి ఆస్తిని అరణంగా తెచ్చుకున్న చంటమ్మభర్త మెతకదనాన్ని అలుసుగా తీసేసుకుంది. బుచ్చిరెడ్డిసొంతంగా తనే చుట్టుకుమరీ కాలుస్తుంటాడు చుట్టలు. పొద్దోయేక పక్కలో జేరిన బుచ్చిరెడ్డి తన నెవరగంత దగ్గర నోరు పెట్టిన వెంటనే కంపు... రోత...అసహ్యం..'' అంటా అరవడం మొదలెట్టింది.

''ఎంత గీర్మాణం ఈ మనిషికి?'' అనుకున్నాడు. కాల్చిన చుట్ట పీకల్ని ఎక్కడ పడితే అక్కడ పారేసే అలవాటున్న బుచ్చిరెడ్డిని చూసి చూసి చాలా అసహించుకోడం. ఆ చుట్టపీకల్ని చూస్తే వాంతి చేసుకోడం మొదలెట్టింది. దాంతో అతని బతుకు మరీ పెట్టమారి



బతుకైపోయింది. ''ఇంట్లో తిని రాములోరి గుడి అరుగుమీద కూర్చునే బదులు ఏదన్నా పని చేసుకోవచ్చు గదా'' అనేసి రోజూ సతాయిస్తా వుంటే ''ఏ పని చెయ్యాలే నేను?'' అన్నాడు.

మొగుడ్ని చిన్నవోరి దగ్గరకి తాపీ పనికి పంపించింది.

పదేళ్ళయినా చంటమ్మకి పిల్లలు పుట్టలేదు. తను గొడ్రాలిని అని బాగా నమ్మకం కుదిరాకా పాలమూరులో ఉంటున్న వాళ్ళ పిన్ని కూతురు శేషావతికి కానుపయితే వెళ్ళి పురిటి మంచం మీద పిల్లని తెచ్చేసుకుని మంగ అని పేరెట్టుకుంది.

తన పెంపుడు కూతురయిన మంగ పెరిగి పుష్పవతయ్యింది.

ఇల్లరికం పద్ధతిలో కొప్పవరం చిన్నం గనిరెడ్డిగారి ఆఖరోడు బుల్లిరెడ్డికిచ్చి పెళ్ళి చేసి అల్లుడ్ని ఇంటికి తీసుకొచ్చింది.

* * *

నెలరోజులు పాటు అల్లుడికి మునుగుడుపు పెట్టేక ఒకరోజు తన బొడ్లో వున్న వెండిరూపాయి తీసి ''ఇదేంటి బాబా?'' అనడిగింది.

''రూపాయి'' అన్నాడు బుల్లిరెడ్డి.

''దీన్ని జాగర్తగా కాపాడుకోవాలి'' అంటా పొదుపుగురించి పాఠాలు చెప్పడం మొదలెట్టింది.

అంతా విన్న బుల్లిరెడ్డి ''నువ్వు చెపుతున్నది పొదుపుగురించి కాదు పిసిని గొట్టుతనం గురించి'' అనేసి రాంపురం రాజుగారి హాల్లో ఆడ్తున్న అగ్గిబరాటా మేట్నీ కెళ్ళిపోయాడు.

పెళ్ళయిన కొత్తల్లోమొగుడు బుచ్చిరెడ్డికి కూడా ఇలాగే చెప్పింది. అతనుకూడా అచ్చం ఇప్పుడు అల్లుడెలా అన్నాడో అలాగే అన్నాడు... అంటే ఈడూ ఆడిలాంటోడేనన్నమాట అనుకుని ఇంకో నెలజూసి తాపీ పనికి వెళ్తున్న మొగుడు బుచ్చిరెడ్డికూడా ఉప్పురితట్టలు మోసే పై పనికి పంపించేసింది అల్లుడ్ని. బుల్లిరెడ్డికి కూడా మాంగారిలా చుట్టలు కాల్చే అలవాటయ్యింది. అయితే మావగారు లావుపాటి చుట్టలు చుట్టుకు కాలిస్తే బుల్లిరెడ్డి సన్నగా గోరుచిక్కుడు కాయల్లాగుండే చుట్టలు చుట్టి కాలుస్తున్నాడు.

అల్లుడు ప్రవర్తన చూసి ఈడూ అచ్చు ఆ మనిషిలాగే తయారయ్యేడు అని రంకెలేస్తా అసహించుకుంటా తాపీవాళ్ళ దగ్గర పైపనికెళ్ళి సంపాయిస్తున్న డబ్బుల్ని కరాకండీగా వసూలు చేస్తుంది. అప్పుడప్పుడు ఒకో అర్ధరూపాయి బిళ్ళో పావలాకాసో తలపాగాలో దాచేస్తే పాగాలాగి దులిపి మరీ పట్టుకెళ్ళిపోతుంది చంటమ్మ.

ఊళ్ళో చిల్లర మల్లర దొంగతనాలు చేసే దొంగక్రిష్ణుడు గోపాలస్వామి గుళ్ళో కంచుగంట దొబ్బేస్తే వాడ్ని చితక బాదించిన వూరిపెద్దలు ''ఏదైనా కూలి పని చేసుకుని ఒబ్బిడిగా బతకరా ఎదవతత్తుకొడకా'' అన్నారు.

''ఆయ్... అలాగేనండి'' అని వెళ్ళిపోయిన దొంగక్రిష్ణుడు చంటమ్మ దగ్గర పాలేరుతనానికి కుదిరేడు.

అలా కుదిరిన రెండోరోజునించీ చాలా దగ్గరయి పోయేడు చంటమ్మకి.

మొగుడికీ అల్లుడుకీ నిన్నటి చితికిన అన్నం పెట్టి దొంగక్రిష్ణుడికి మట్టుకి వేడన్నంలో బాతుగుడ్డు పులుసేసి పెడ్తుంది. వాడు బయటికెళ్తుంటే పుంజీడు పాకుండలూ, పూతరేకుల చుట్టలూ ఆడి దోసిట్లో పెట్టి ''తింటా ఎళ్ళరా బాబా'' అంటంది.

మొగుడు బుచ్చిరెడ్డికీ అల్లుడు బుల్లిరెడ్డికీ ఎందుకు ఆడ్నంత ఇదిగా చూస్తుందో అర్థం గావడం లేదు. మాంగారూ అల్లుడు ఒక వారం పాటు కష్టపడి డిటెక్షన్ చేస్తే అసలు పాయింటు బయటపడింది. అదేంటంటే పొద్దోయాకా బ్రేమ్మల సుబ్బారావుగారి దొడ్లో

కొబ్బరికాయల గెలలు దొంగతనంగా నరుక్కొచ్చి చంటమ్మగారి గాదుల సావిట్లో పారేస్తున్నాడు. మొన్న...ఎప్పుడూ తాళాలు వేసుండే కరణాల మూడు మండువాల లోగిట్లో పంచలోహాల్తో చేసిన దేవుడి విగ్రహాలు పట్టు కొచ్చేడు. అదిగో అప్పట్నుంచి ఆడ్ని అంత అత్తారబతంగా చూసుకోడం మొదలెట్టింది చంటమ్మ.

* * *

వాళ్ల పంటమీద వచ్చే ఆదాయంతో పాటు ఈ కొత్త ఆదాయంకూడా కలిపి ఎవరన్నా డబ్బు అప్పు అడిగితే ఉప్పుకుండ కింద దాచిన డబ్బు ఇవ్వడం మొదలెట్టింది. అలా దాచిన డబ్బు ఎదుటోళ్ళకిస్తే దరిద్రమంతా వాళ్లనంటేసుకుని ఐశ్వర్యమంతా ఇచ్చినోళ్ళ ఒళ్లో పడద్దని మా ప్రాంతం మనుషుల నమ్మకం.

చంటమ్మ నోటికి జడిసి బాకీ లెవరూ ఎగ్గొట్టేవారు కాదు. పాపం పట్టికెళ్ళినోళ్ళు చెడిపోయి ఇళ్లో, మడిచెక్కో రాసిచ్చేసేవారు. ఇన్‌స్టాల్ మెంటోళ్ల దగ్గర స్టీలు సామాన్లు తీసుకుని వాడికి కట్టేదో ఎగ్గొట్టేదోగానీ చివరికి ఆ సామాన్లన్నీ పైన సరంబీమీద దాచి పెట్టేది తప్ప, ఒక్కనాడు తీసి వాడిన పాపాన పోలేదు.

అది చూసిన అల్లుడు బుల్లిరెడ్డి ''అదేంటి మాంగారూ?'' అన్నాడు.

నవ్వేసిన బుచ్చిరెడ్డి ''ఇదేం చేసేవు పెళ్ళికి కొనుక్కొన్న పట్టుచీరల మడతలే ఇంకా విప్పలేదు. ఎందుకూ నెలకోసారి కలరా ఉండలు పెట్టడానికి తప్ప ఆ బీరువా తలుపే తెరవదు తెల్సా?'' అన్నాడు.

అప్పనంగా సంపాయించిన సామాన్లు భోషాణంలో దాచి పెట్టేది. ఇత్తడి సామాన్లు ఏడాదికోసారి ఉప్పు చింతపండుతో తళతళలాడేలా తోమి ఎండలో దబ్బళించి మళ్ళీ సరంబీ మీద బోర్లించేసేది.

గాలిపంకా ఒకటికొంది. కరెంటు బిల్లు ఎక్కువ వస్తదని అసలా పంకాకున్న ప్లాస్టిక్ కాయితాలు సీళ్ళుకూడా విప్పకండా మిద్దెమీదే దాచేసింది.

చంటమ్మతో విసిగిపోయిన బుచ్చిరెడ్డి ముందు కాశీ వెళ్లిపోదామనుకుని ఛీ..ఛీ..ఈ ఎదవ మీద అలిగి అంత దూరం ఎందుకెళ్ళాలనుకుని భోగమోళ్ళ వీధిలో ఉన్న నీలవేణి ఇంట్లో కెళ్ళిపోయాడు..

డబ్బు సంపాదించే మదంతో గిజగిజా కొట్టుకుంటున్న చంటమ్మ మొగుడెళ్లిపోయి నందుకు పిసరంతైనా బాధ పడ్లేదుగానీ పోతా పోతా సామాన్లేవన్నా పట్టుకుపోయేడా అని ఇల్లంతా కలతిరిగి చూసుకుని ఏదీ పట్టుకెళ్ళలేదని తేలాక''పోన్లే సచ్చినోణ్ణి పోనీ'' అనుకుంది.

మావగారు అలా వెళ్ళిపోయేసరికి ఆ కొంపలో ఇక ఉండలేకపోయిన అల్లుడు బుల్లిరెడ్డి రాంపురం చప్పిడోరి సావరంలో అద్దిల్లు తీసుకుని పెళ్ళాంతో పాటు గేలాపెత్తేసేడు.

అటు భర్త ఇటు కూతురూ అల్లుడూ వెళ్ళిపోయినందుకు ఇసుమంతైనా బాధ పడలేదు చంటమ్మ.

దొంగక్రిష్ణుడి కారణంగా సంపాదన నాలుగు మూలల్నుంచి వచ్చి పడిపోతుంది ఆడు పోతే బాధ పడాలిగానీ ఈళ్ళంతా పోతే ఎందుకు? అనే దశ కొచ్చేసింది.

* * *

చాలా ఏళ్ళు గడిచిపోయినియ్యి. చంటమ్మ వయసై పోయింది.

పూర్వంలాగా ఇప్పుడు చురుగ్గా ఉండలేకపోతుంది చంటమ్మ. అప్పుడప్పుడూ కళ్ళు తిరుగుతున్నాయి. నిలబడ్లేక దొంగక్రిష్ణుడి భుజం ఆసరాగా తీసుకుని నడుస్తుంది.

దొంగక్రిష్ణుడు పోరగా పోరగా చెలికాని రామారావుగారి హాస్పిటలు కెళ్ళింది.

పరీక్షలు చేసి రక్తపోటుందని బిళ్ళలు రాసిచ్చేరు డాక్టరుగారు.

ఇప్పుడా బిళ్ళలన్నీ కొంటే ఎంతవుద్దో ఏంటో అని భయపడి మందుల చీటీని కుళ్ళికాలవలో పారేసింది.

ఇంటికెళ్ళాకా అనపర్తిసావరంలో ఎవరో ఇలాంటి జబ్బులికి డబ్బులేం తీసుకోకండా మంత్ర మేస్తున్నారని తెల్సి అక్కడికెళ్ళింది.

ఇంకొన్నాళ్ళకి కాళ్ళూ చేతులూ తెగ లాగెయ్యడం మొదలెట్టినియ్యి. బొటన వేలుకి గొప్పు తగిలి పుండయి మానలేదు.

దొంగక్రిష్ణుడి బలవంతం మీద ఈసురో మంటా డాక్టరుగారి దగ్గరకెళ్తే నీరుడూ, రక్తం పరీక్షలుచేసి సుగరొచ్చిందని మందులు రాసిచ్చేరు.

ఆ చీటి తీసుకుని మందులషాపు కెళ్ళింది. వందరూపాయలన్నారు కొరెడ్లోళ్ళ మందుల షాపులో..."అమ్మో" అనరిచి ఇంటి కొచ్చేసింది.

ఎవరో చెబితే రామచంద్రపురం అవతల నదురుబాద వెళ్ళి నాటుమందేదో తెచ్చుకుంది రెండ్రూపాయిలికి.

కొన్నాళ్ళు గడిచినియ్యి.

మంచం వీది అరుగుమీదేయించుకుని దాని మీదే ఉంటుంది. రోజులో ఎక్కువ సేపు దానిమీదే గడుపుతుంది. దొంగకృష్ణుడి సాయంతో అప్పులిచ్చిన వాళ్ళ దగ్గర మంచం మీదుండే వసూలు చేస్తుంది.

రోగాలు ముదిరిపోయినియ్యి. చూపుకూడా కాస్త మందగించడంతో మళ్ళీ డాక్టరుగారి దగ్గరకెళ్లింది.

టెస్ట్లన్నీ చేసి రెండు కిడ్నీలూ పాడయిపోయినియ్యన్నారు.

ఇంటికి తిరిగొచ్చి డాక్టరుగారిచ్చిన మందులచీటీ తల దగ్గరున్న టెక్కే కింద పెట్టింది.

నరాలపాలెంలో ఎవరో ఇస్తున్న పసరు మందు బాగా పని చేస్తుందంట అని దొంగ క్రిష్ణుడంటే వాడ్ని ఆ పని మీద పంపించి నీరసంగా పడుకుంది.

బలంగా మాంచి కుదుమట్టంగా ఉండే చంటమ్మ గోరింటాకు ఆకు దూసేసిన కొమ్మలాగా తయారైంది. ఒబ్బిడిగా ముఖం కడుక్కుని రాజమండ్రి జాలీఫేస్ పౌడరు రాసుకున్న ట్టుండే ముఖం బాగా పీక్కుపోయి దవడ కింద ఎముకలు బయటికొచ్చేసినియ్యి. ఒకప్పుడు పొడుగ్గా పొడపాములాగ గుప్పిట్లోకి అందనంత ఒత్తుగా ఉండే జుట్టు ఈరోగాలకి పూర్తిగా ఊడిపోయి పీచుతీసిన కొబ్బరి పిలకలా తయారైంది.

ఆమె వాలకం చూసిన దొంగక్రిష్ణుడు మంచం దగ్గరకొచ్చి "బుచ్చిరెడ్డిగార్నీ కూతురూ అల్లుడ్నీ వచ్చెయ్యమని చెపుదాం ఏవంటారండి?" అని ఒప్పించేడు.

"రమ్మను" అంది చంటమ్మ.

ఆదరంగా పిలుస్తుంది అనుకుంటూ వచ్చిన బుచ్చిరెడ్డిని అంత నీరసంలోనూ ఇన్నాళ్ళు సంపాయించిన సొమ్ము ఆ నీలవేణికిచ్చేవు

కదా వెంటనే అది పట్రమ్మని పెద్దపెద్ద కేకలేసింది. అలాగే అల్లుడ్ని కూతుర్నీకూడా తనని అలా వదిలేసి వెళ్ళినందుకు నానాబూతులూ తిట్టి ఇన్నాళ్ళూ సంపాయించింది పట్రమ్మని ఆర్డర్లేయడం మొదలెట్టింది.

ఆ మనిషి దెబ్బకి.

పొద్దోకముందే నీలవేణి ఇంటేపు పరిగెట్టాడు బుచ్చిరెడ్డి. కూతురూ అల్లుడూ రామచంద్రపురం పారిపోయేరు.

ఒకరాత్రి మూతులకి నల్లగుడ్డలు కట్టుకుని దిగారు ఇద్దరు బలమైన దొంగలు వాళ్ళు చంటమ్మనోట్లో గుడ్డలు కుక్కేసి మంచం మీద పడుకునున్న ఆ మనిషిని ఉన్న పళానే చాంతాళ్ళతో కట్టేసి ఆమె కళ్ళ ముందే ఇన్నేళ్ల నించి ఆమె సంపాయించిన నగానట్రా. డబ్బూ డస్కం మొత్తం మూటలు గట్టేసుకున్నారు. అదంతా చూస్తున్న చంటమ్మ ఎంత ఓపిక లేకపోయినా గింజుకుంటుంది.

ఒక దొంగ జేబులోంచి కొన్ని కాయితాలు తీసి ''నువ్వు సంపాయించిన ఆస్తి మొత్తం మనూరు చింతాలమ్మ గుడికి రాసెయ్'' అన్నాడు.

''రాయను రాయను'' అంటా గింజుకుంటుంది.

బొడ్లోంచి బాకు తీసేడు.

దాన్ని చూస్తే ఎవరికన్నా ఒణుకొస్తుంది. అలా మెరుస్తుందది. గజగజా ఒణికిపోయిన చంటమ్మ దస్తావేజుల్లో ఆడు చూపించిన చోటల్లా వేలి ముద్రలేసేసింది.

అనారోగ్యం కన్నా ఆస్తి మొత్తం పోయిందన్న మనియాదతో పడి కొట్టుకుంటున్న చంటమ్మ అర్ధరాత్రి వేళప్పుడు ఈలోకం నించెళ్ళిపోయింది.

పొద్దుటే చంటమ్మ శవం దగ్గరకొచ్చిన దొంగక్రిష్ణుడు ''చెప్తే విన్నారుగాదు అక్కయ్యగారూ చివరికేం పట్టుకెళ్ళేరు?'' అంటా ఏడుస్తున్నాడు.

దారమ్మటెళ్తున్న జనం నలుగురు చంటమ్మ శవం దగ్గరకొచ్చి చూసి వెళ్ళిపోతున్నారు.

దొంగక్రిష్ణుడిగ్గానీ, వెళ్ళిపోతున్న ఆ జనానికిగానీ కాస్త దూరంలో పచ్చిమట్టిలో దిగబడి ఉన్న దొంగల అడుగులకి కాస్త దూరంలో పారేసి ఉన్న లావుపాటీ, సన్నటీ చుట్టపీకలు కనిపించలేదు.

* * *